

వృత్తిపై మమకారం..

చేనేత వస్త్రాల తయారీలో కొత్త డిజైన్లు సృష్టిస్తూ అవార్డులు పొందుతున్నాడు భూదాన్ పోచంపల్లికి చెందిన సాయి భరత్. - 10లో



క్షేత్రస్థాయి అవగాహన అవసరం

అగ్రికల్చర్ విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన అవసరమని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త లవకుమార్ అన్నారు. - 12లో



వంగపల్లిలో ఒడిశా అధికారులు

ఒడిశా రాష్ట్రానికి చెందిన అధికారులు శుక్రవారం యాదగిరిగుట్ట మండలం వంగపల్లిని సందర్శించారు. - 12లో

న్యూస్‌రీల్

'అంబేడ్కర్ విద్యానిధి'కి దరఖాస్తుల ఆహ్వానం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువులకు అందించే ఆర్థికసాయానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కె.దయానందరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌత్ కొరియా మొదలగు దేశాల్లో ఉన్నత చదువులకు వెళ్లవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల ఎస్సీ అభ్యర్థులు https:// telanganaepasscbb gov.in ద్వారా ఈ నెల 30లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

పశుసంవర్ధక శాఖలో విలీనం చేయాలి



అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గోపాలమిత్రలు

భానుపురి (సూర్యాపేట): తమను పశుసంవర్ధక శాఖలో విలీనం చేయాలని గోపాల మిత్రలు కోరారు. ఈ మేరకు గోపాల మిత్రల సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అల్దాసు లింగయ్య మాట్లాడుతూ 23ఏళ్లుగా పశుసంవర్ధక శాఖలో భాగమై పశు గణాభివృద్ధి సంస్థలో కృత్రిమ గర్భధారణ నిపుణులుగా పనిచేస్తున్నామని తెలిపారు. దాదాపు ఏడేళ్ల పాటు ఎలాంటి గౌరవ వేతనం లేకుండానే పనిచేశామని, ప్రస్తుతం చాలీచాలని జీతాలతో కుటుంబాలు గడవక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు రామయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా విజయలక్ష్మి



నేరేడుచర్ల: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్య నిర్వాహక కార్యదర్శిగా నేరేడుచర్ల మండల కేంద్రానికి చెందిన రాచకొండ విజయలక్ష్మిని నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఉప్పల శారద శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, స్వామి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. అనంతరం స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సవం చేపట్టి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాబాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు భక్తులు పాల్గొన్నారు.

30 వరకు ఓపెన్ ఇంటర్ పరీక్ష ఫీజు గడువు

సూర్యాపేట టౌన్: ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాయబోయే అభ్యర్థులు ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించుకోవచ్చని సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాళ్ల యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31 నుంచి అక్టోబర్ 4 వరకు రూ.25 అపరాధ రుసుంతో, అక్టోబర్ 05 నుంచి 9 వరకు రూ.50 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించి హాల్ టికెట్లు పొందాలని పేర్కొన్నారు. ఫీజు చెల్లించబోయే అభ్యర్థులు ఆధార్ కార్డు, పదో తరగతి మెమో, టీసీ, కుల ధ్రువీకరణ పత్రంతో పాటు పాస్ ఫొటోలతో సంప్రదించాలని కోరారు.

వేగంగా క్రమబద్ధీకరణ

- మొదలైన జేపీఎస్‌ల రెగ్యులరైజేషన్ ప్రక్రియ
- క్షేత్రస్థాయిలో పనితీరును పరిశీలిస్తున్న జిల్లాస్థాయి కమిటీ సభ్యులు
- వివిధ అంశాలపై వంద మార్కుల కేటాయింపు
- చేసిన పనుల ఆధారంగా సిద్ధమవుతున్న నివేదిక



సమ్మె చేస్తున్న జూనియర్ కార్యదర్శులు (ఫైల్)

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్‌ల) క్రమబద్ధీకరణ ప్రక్రియ వేగవంతమైంది. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి క్షేత్రస్థాయిలో జేపీఎస్‌ల పనితీరు ఆధారంగా వారిని రెగ్యులరైజ్ చేసేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇందుకు జిల్లా స్థాయిలో ఓ కమిటీని నియమించారు. ఈ కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా అటవీ అధికారి, డీఎస్పీలు ఉన్నారు. అయితే జిల్లాలో 335 మంది జేపీఎస్‌లు ఉండగా ఇందులో జూలై చివరి నాటికి 192 మంది నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం పూర్తి కా గా వీరి క్రమబద్ధీకరణకు ప్రక్రియ కొనసాగుతోంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని 23 మండలాల్లో ఉన్న 475 గ్రామ పంచాయతీల్లో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు 105 మంది, జేపీఎస్‌లు 335 మంది, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు 52 మంది ఉన్నారు. అయితే 335 మంది జేపీఎస్‌లలో 192 మంది ప్రొబేషనరీ కాలం ముగిసింది. ప్రొబేషనరీ కాలం ముగిసిన వారిలో మెరిట్ ఆధారంగా ఇప్పటికే 19 మందిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించారు. మిగతా 173 మందిని త్వరలోనే క్రమబద్ధీకరించే అవకాశం ఉంది. అదేవిధంగా మరో మూడు నెలల్లో ప్రొబేషనరీ కాలం పూర్తి కాబోయే 143 మంది అనంతరం రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించబడుతారు. వీరి పనితీరు ఆధారంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు 100 మార్కులకు గాను జిల్లా కమిటీ కేటాయించే మార్కులతో తుది నివేదికను తయారు చేసి రాష్ట్ర కమిటీకి పంపుతారు. రాష్ట్ర కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల వివరాలు	
మొత్తం జేపీఎస్‌ల సంఖ్య	335
నాలుగేళ్ల ప్రొబేషనరీ కాలం పూర్తయిన వారు	192
మూడు నెలల్లో పూర్తయ్యేవారు	143
ఇప్పటికే ఉద్యోగులుగా గుర్తించిన వారు	19

పనితీరుపై పర్యవేక్షణ

క్రమబద్ధీకరణకు సంబంధించి నియమించిన కమిటీ జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తోంది. గ్రామాల్లో రోడ్లు, కాలువలు, రికార్డులు, తడి, పొడి చెత్త సేకరణ, కాంపోస్ట్ షెడ్, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, క్రీడా ప్రాంగణాల నిర్వహణ, గ్రామసభలు, జేపీఎస్‌ల హాజరు, పన్నుల వసూలు, అభివృద్ధి పనులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ అంశాల్లో 100 మార్కులకు గాను జేపీఎస్‌ల పనితీరును బట్టి నివేదిక తయారు చేస్తున్నారు.

ప్రక్రియ ప్రారంభమైంది

జేపీఎస్‌ల క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్రస్థాయి కమిటీ మార్గదర్శకాల ఆధారంగా జేపీఎస్‌ల పనితీరు ప్రాతిపదికన రెగ్యులర్ అయ్యే అవకాశం ఉంది. జిల్లాలో 335 జేపీఎస్‌ల్లో 194 మంది క్రమబద్ధీకరణకు కమిటీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తోంది.

– యాదయ్య, డీపీఓ, సూర్యాపేట

చిన్నారుల్లో క్రీడా స్ఫూర్తి పెంచాలి



ప్రధానోపాధ్యాయులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, డీఈఓ

- విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి
- ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా సామగ్రి పంపిణీ

సూర్యాపేట టౌన్: ప్రస్తుత సమాజంలో చిన్నారులకు కావాల్సిన అసలైన విద్య క్రీడలతోనే లభిస్తుందని, ప్రతిఒక్క విద్యార్థిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలు క్రీడలకు దూరంగా ఉంటూ.. కేవలం తరగతి, హాస్టల్ గదులకే పరిమితం కావడం వల్లే అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. నేటి విద్యార్థులు సెల్ ఫోన్ల ప్రభావంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితి నుంచి వారిని బయట పడేయాలంటే క్రీడలు ఆడించాలన్నారు. క్రీడల్లో గెలుపోటముల అనుభవాలు జీవితంలో వచ్చే ఆటు, పోట్లు తట్టుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఇటీవల తాను సూర్యాపేట నియోజకవర్గంలో నిర్వహించిన క్రీడల్లో మహిళలతో సహా వేలాదిగా పాల్గొనడం ఎంతో ఆనందానిచ్చిందన్నారు. ఈ సందర్భంగా మంత్రిని వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావు, డీఈఓ అశోక్, జిల్లా క్రీడల అధికారి బి.వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం

భానుపురి (సూర్యాపేట): మహిళా ఆరోగ్యం, సాధికారతకు ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేటలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో వాసవీ– వనితా క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి 104 మంది గర్భిణులకు చీరలు, పండ్లు, పూలు పంపిణీ చేసి ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులమత భేదాలు లేకుండా ఇంతమంది పేద మహిళలకు వాసవీ–వనితా క్లబ్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తొమ్మిదేళ్లలో 13,90,636 మంది బాలింతలు కేసీఆర్ కిట్ ద్వారా లబ్ధిపొందగా, 6.84 లక్షల మంది గర్భిణులకు కేసీఆర్ పౌష్టికాహార కిట్లు అందించామన్నారు. ఆడబిడ్డలకు రక్షణ కల్పించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి షీ టీమ్‌లను ప్రారంభించారని తెలిపారు. మహిళల కోసం ముఖ్యమంత్రి ఇటీవల ఆరోగ్య మహిళ పథకం తెచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ ఉప్పల లలితాఆనంద్, గుండా శ్రీదేవి, రాచకొండ శ్రీనివాస్, చల్లా లక్ష్మీకాంత్, రాచర్ల కమలాకర్, తోట శ్యామ్, లక్ష్మి, వెంపటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు చీర, పూలు, పండ్లు అందిస్తున్న మంత్రి

గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నిరుద్యోగులు

సూర్యాపేట టౌన్: గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేయాలని నిరుద్యోగులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి ప్రధాన రోడ్లపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించే గ్రూప్–2 పరీక్షలను మూడు నెలలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. 70శాతం సిలబస్ మార్చారని, మార్కెట్‌లో మెటీరియల్ కూడా దొరకడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విరామం లేకుండా పరీక్షలు నిర్వహించడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ అభ్యర్థులు శతకోటి పరశురామ్, ఎడ్ల మహేష్, లెనిన్, వెంకటేష్, విఠల్, వీరబాబు, సుధా, అనిత, సాహితీ, రుచిత, పావని తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలి

మఠంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట క్షేత్రంలో ఈనెల 13న జరిగే తెలంగాణ కరణం నియోగి ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్లు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, బి.వెంకటరమణారావు కోరారు. శుక్రవారం మట్టపల్లిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సభకు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్రమంత్రులు, జగదీష్‌రెడ్డి, హరీష్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో కొండపల్లి సింగరయ్య, రామకృష్ణప్రసాద్, రామరంగారావు తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా బీపీ మందులు వాడాలి



ఆత్మకూర్(ఎస్)లో మహిళతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హర్షవర్ధన్

సూర్యాపేట, ఆత్మకూర్(ఎస్): బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. శుక్రవారం వారు సూర్యాపేట, అంబేడ్కర్ నగర్, ఆత్మకూర్ (ఎస్)లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వేర్వేరుగా పరిశీలించారు. అనంతరం ఆయా కేంద్రాల పరిధిలో బీపీ, షుగర్ బాధితుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో బీపీ, షుగర్‌కు వేర్వేరుగా రెండు మాత్రలు ఉండేవని, కానీ నేడు తెలంగాణ ప్రభుత్వంలో రెండింటిని కలిపి ఒకే కాంబినేషన్ డ్రగ్స్‌గా తీసుకువచ్చిందన్నారు. బయట ఎంతో ఖరీదు కలిగిన ఈ మాత్రలు ఇప్పుడు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. 30 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరూ బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకునేందుకు ఆరోగ్య కార్యకర్తలకు ప్రత్యేకంగా బీపీ మిషన్లు పంపిణీ చేసినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా బాధితులకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ భూతరాజు సైదులు, సాంబశివరావు, రమాదేవి, ఆత్మకూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి రాజ్ కుమార్, డాక్టర్ వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి పిల్లలు సర్కారు బడికి..



తన కుమారుడితో పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడు నరేందర్ (వృత్తంలోని వ్యక్తి)

మోతె: మండలంలో విభళాపురం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దామళ్ల నరేందర్ తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ విషయం శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తన ఇద్దరు పిల్లలను ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పంపిస్తున్నారు. వీరిలో బాలుడు 5వ తరగతి, బాలిక 3వ తరగతి చదువుతున్నారు. ప్రైవేటులో కన్నా ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య అందుతుందన్న నమ్మకంతోనే చదివిస్తున్నానని నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ ఉపేందర్ మాట్లాడుతూ మాపై నమ్మకంతో తన పిల్లలిద్దరినీ ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్న నరేందర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయుడు నరేందర్‌ను ఇతర పిల్లల తల్లిదండ్రులు ఆదర్శంగా తీసుకొని తమ పిలలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్న నరేందర్‌కు ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు బండి పాపిరెడ్డి, ఏల శీనయ్య, సామ సాయి, సామ శ్యాం, ఆర్.కృష్ణ అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు ఉత్తమ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆర్టీసీ డ్రైవర్ సైదులు

మద్దిరాల: సూర్యాపేట ఆర్టీసీ డిపోలో బస్ డ్రైవర్ పనిచేస్తున్న మండల కేంద్రానికి చెందిన చామకూరి సైదులుకు రెండోసారి నల్లగొండ రీజియన్ స్థాయిలో ఉత్తమ టిమ్ డ్రైవర్ అవార్డు అందుకున్నారు. శుక్రవారం నల్లగొండ డిపోలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం నాయక్ చేతుల మీదుగా అవార్డు అందించి అభినందించారు. ఆర్టీసీ ఆదాయం పెంపునకు కృషి చేసినందుకు తనకు ఈ అవార్డు దక్కిందని సైదులు పేర్కొన్నారు.

యాదాద్రిలో ఊంజలి సేవ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి ఊంజలి సేవ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో ఊంజలి సేవ జరిపించారు. మహిళలు మంగళ హారతులతో సేవకు స్వాగతం పలికారు. ఇక ప్రధానాలయంలో విశేష పూజలు కొనసాగాయి. సుదర్శన నారసింహహోమం, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవ తదితర కైంకర్యాలు నిర్వహించారు.

క్లుప్తంగా

గూడ్స్ రైళ్లను ఉపయోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్

మిర్యాలగూడ : రైస్ మిల్లర్లు తమ వ్యాపార అభివృద్ధికి గూడ్స్ రైళ్లను ఉపయోగించుకోవాలి దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ కమర్షియల్ మేనేజర్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో బిజినెస్ డెవలప్‌మెంట్ అనే అంశంపై రైల్వే అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రోడ్డు రవాణా కంటే రైలు గూడ్స్‌లో బియ్యం, ధాన్యం, సరుకులు తరలించడం వల్ల డబ్బు, సమయం ఆదా అవుతుందని చెప్పారు. తిప్పర్తి సమీపంలో ప్రైవేట్ లాజిస్టిక్స్ గోదాం అభ్యర్థన మేరకు కార్గో టెర్మినల్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఆ టెర్మినల్ వల్ల సంవత్సరానికి రూ.18 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. సకాలంలో ర్యాకులు ఏర్పాటు చేయాలని మిల్లర్లు కోరగా తప్పకుండా చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో రైల్వేస్ ఏఓఎం (గూడ్స్) పూర్ణచందర్‌రావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ అధ్యక్ష, కార్యదర్శులు గౌరు శ్రీనివాస్, బి.వెంకటరమణచౌదరి, గుడిపాటి శ్రీనివాస్ ఉన్నారు.

సీపీఆర్‌తో వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీస్

నూతనకల్ : గుండెపోటుకు గురై రోడ్డుపై పడిపోయిన వ్యక్తికి హెడ్‌కానిస్టేబుల్ సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు. ఈ ఘటన నూతన్‌కల్ మండల పరిధిలోని 365వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...నూతనకల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య మరో కానిస్టేబుల్‌తో కలిసి హైవేపై వెళ్తుండగా అదే సమయంలో అక్కడ గుర్తు తెలియని వ్యక్తి గుండెపోటుకు గురై కిందపడి కొట్టుకుంటున్నాడు. గమనించిన హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య అతనికి సీపీఆర్ చేసి కోలుకున్న తర్వాత 108 వాహనంలో సూర్యాపేటకు తరలించారు. వ్యక్తి ప్రాణాలు కాపాడిన హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్యను ఎస్‌ఐ నరేష్‌తో పాటు ప్రజలు అభినందించారు.



గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య

వృత్తిపై మమకారం.. ఉన్నతికి సోపానం

- ఎంటెక్ చేసి ఉద్యోగాన్ని వదిలి కులవృత్తిలోకి..
- చేనేత వృత్తిలో రాణిస్తూ పలువురికి ఉపాధి
- టీ–టాప్ ద్వారా కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్ ఏర్పాటు
- నేడు యూనిట్‌ను ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్





సాయిని భరత్ నిర్వహిస్తున్న కళా పునర్వి హ్యాండ్లూమ్స్‌లో పనిచేస్తున్న చేనేత కార్మికులు

భూదాన్‌పోచంపల్లి : కులవృత్తిపై ఉన్న మమకారం ఆ యువకుడిని ప్రయోగాలకు పురికొల్పింది. తనలో ఉన్న సృజనకు ఆధునిక సాంకేతికతను జోడించి నూతన డిజైన్లు సృష్టించాడు. విభిన్నంగా చేనేత వస్త్రాలను తయారు చేస్తూ ప్రముఖుల ప్రశంసలు పొందతూ, ఆవార్డులు గెలుచుకొంటున్నాడు. తానొక్కడే ఉపాధి పొందడమే కాకుండా 80మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిన ఓ యువకుడి విజయగాథ ఇది...

భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రానికి చెందిన సాయిని భరత్ ఎంటెక్ పూర్తి చేసి ఆరేళ్లపాటు ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశాడు. చేనేత కుటుంబంలో జన్మించిన సాయిని భరత్ చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు చేస్తున్న కులవృత్తిని చూస్తూ ఆ వృత్తిపై ఆసక్తి పెంచుకొన్నాడు. సంప్రదాయంగా వస్తున్న చేనేతలో నూతన ప్రయోగాలు, ఆవిష్కరణలు చేయడం ద్వారా ఆ వృత్తిని పది కాలాల పాటు సజీవంగా ఉంచవచ్చునని భావించాడు. దాంతో విద్యార్థి దశ నుంచే సొంతంగా చిన్న మగ్గం తయారు చేసి దానిపై ఎందరో జాతీయ నాయకుల కళాఖండాలను సృష్టించి లిమ్కాబుక్ ఆఫ్ రికార్డుతో పాటు పలు అవార్డులు సొంతం చేసుకొన్నాడు. అలా చేనేతలో నిత్య ప్రయోగాలు చేస్తూ సొంతంగా డిజైన్లు తయారు చేస్తూ దేశ, విదేశాలకు వస్త్రాలను ఎగుమతి చేస్తూ తనకంటూ సొంత ఇమేజ్‌ని సంపాదించుకొన్నాడు.

వచ్చిన అవార్డులు ఇవీ..

- 2014లో చిన్న మగ్గంపై జాతయ నాయకుల కళాఖండాలను రూపొందించినందుకు లిమ్కా బుక్ రికార్డులోకెక్కాడు
- 2014లో వండర్ బుక్ ఆఫ్ రికార్డు వరించింది
- 2014లో తెలుగు బుక్ ఆఫ్ రికార్డు
- 2014లో తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు
- 2018లో చేనేతలో డిజైనింగ్‌లో జాతీయ మెరిట్ సర్టిఫికెట్ అందుకొన్నాడు
- 2018లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి అవార్డు

రాష్ట్రంలోనే మొట్టమొదటి యూనిట్

మంత్రి కేటీఆర్ చొరవతో తెలంగాణ టెక్స్‌టైల్ అండ్ అపెరల్ పాలసీ (టీ–టాప్) కింద రాష్ట్రంలోనే మొదటిసారిగా రూ.4 కోట్ల వ్యయంతో కళా పునర్వి ఇంటిగ్రేటెడ్ హ్యాండ్లూమ్ యూనిట్‌ను నెలకొల్పాడు. ప్రస్తుతం ఇక్కడ 80 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. ఈ యూనిట్‌ను అధికారికంగా మంత్రి కేటీఆర్ ఈ నెల 12న ప్రారంభించనున్నారు.

దారం నుంచి వస్త్రం వరకు..

కాగా భరత్ నెలకొల్పిన కళా పునర్వి ఇంటిగ్రేటెడ్ హ్యాండ్లూమ్ యూనిట్‌లో దారం నుంచి వస్త్రం వరకు ఇక్కడే తయారవుతాయి. బెంగుళూరు నుంచి తెప్పించిన సింగిల్ దారంను మొదట వైడింగ్ చేయడం, బాబిన్‌చుట్టడం, డబులింగ్ చేయడం, ట్విస్ట్ చేయడం, రీవైడింగ్ చేయడం, డీ గమింగ్ చేయడం, ఆసుపోయడం, మార్కింగ్ చేయడం, డిజైనింగ్ చేయడం, టై అండ్ డై చేయడం, చివరకు మగ్గంపై వస్త్రాలను నేయడం అన్ని ప్రక్రియలన్నీ ఒకేదగ్గర చేయడం మరో ప్రత్యేకత. దీని వల్ల వస్త్రం ఎంతో నాణ్యతగా ఉంటుంది.

నూతన ఆవిష్కరణలు చేస్తా

ఎంటెక్ పూర్తి చేసి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా జాబ్ చేశాను. కానీ, కులవృత్తిపై ఉన్న ఫ్యాషన్‌తో జాబ్ మానేశాను. చేనేత వృత్తిలో నూతన ఆవిష్కరణలు చేస్తున్నాను. ఆ కొత్తదనమే నన్ను ఈ స్థానానికి చేర్చింది. మొట్టమొదటిసారిగా చిప్‌తో పనిచేసే ఎలక్ట్రానిక్ జకాట్ మిషన్‌ను చేనేతలో ప్రవేశపెట్టాలనే ఆలోచన చేస్తున్నాను. నాకు దేశ, విదేశాలలో కస్టమర్లు ఉన్నారు. ఆర్డర్‌పై ఎలాంటి డిజైన్‌లోనైనా వస్త్రాలను తయారు చేసే సామర్థ్యం ఉంది. మంత్రి కేటీఆర్ చొరవతో టి–టాప్ ద్వారా హ్యాండ్లూమ్ యూనిట్‌ను నెలకొల్పి 80 మందికి పని కల్పిస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– సాయిని భరత్,
కళాపునర్వి హ్యాండ్లూమ్స్, భూదాన్‌పోచంపల్లి



రెండువైపులా డిజైన్లు కల్గిన దుప్పట్టాను ప్రదర్శిస్తున్న సాయిని భరత్

నూతన డిజైన్లకు రూపకల్పన

భరత్ నిత్య ప్రయోగశీలి. అతనికి చిన్నప్పటి నుంచి కళ పట్ల మక్కువ, సృజనాత్మకత మెండు. దాంతో నేటి యువత అభిరుచులకు అనుగుణంగా ప్రాంతాలకు అనుగుణంగా చేనేతలో వినూత్న డిజైన్లు రూపొందిస్తున్నాడు. రెండువైపులా వేర్వేరు డిజైన్లు, రంగులు కల్గిన దుప్పట్టాను రూపొందించాడు. కస్టమర్ల ఆర్డర్‌పై ఎలాంటి డిజైన్ అయినా కంప్యూటర్‌లో రూపొందించి దానిని వస్త్రంపై ఆవిష్కరిస్తున్నాడు. అంతేకాక నాణ్యతమైన వస్త్రాలను రూపొందిస్తూ, దేశంలోని ప్రధాన నగరాలు, షోరూమ్‌లతో పాటు ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, వాట్సప్ లాంటి సోషల్ మీడియా ద్వారా విదేశాలకు సొంతంగా మార్కెటింగ్ చేస్తున్నాడు.



కంప్యూటర్‌లో డిజైన్‌లను రూపొందిస్తున్న సాయిని భరత్

మెరుగైన పనితీరుతోనే ఆర్టీసీకి ఆదాయం

నల్లగొండ రూరల్ : ఉద్యోగుల మెరుగైన పనితీరుతోనే ఆర్టీసీకి ఆదాయం సమకూరుతుందని హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తం నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌ఎం కార్యాలయంలో రీజియన్ పరిధిలోని 7 డిపోల్లో ఉత్తమ ప్రతిభ చూపిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీకి.. ప్రయాణికుల భద్రత, భరోసాకు బ్రాండ్‌గా పేరుందని తెలిపారు. బస్సుల కండీషన్, ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కావడంతో మంచి రోజులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఎం శ్రీదేవి, డిప్యూటీ ఆర్‌ఎం శివశంకర్, మాధవి, వెల్ఫేర్ మెంబర్ తయ్యాబ్, శారద తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పురుషోత్తం నాయక్

కోర్టు ఆదేశాలను ధిక్కరించిన ఎస్‌ఐకి జైలు

సూర్యాపేట: కోర్టు ఆదేశాల ధిక్కరించిన మఠంపల్లి పోలీస్‌స్టేషన్‌లో గతంలో పనిచేసిన ఎస్‌ఐ రవికి 7 రోజుల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ హైకోర్టు జడ్జి జస్టిస్ రాధారాణి తీర్పునిచ్చారు. ఈమేరకు బాధితుడి తరపు న్యాయవాది కుక్కడపు బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. మఠంపల్లి మండలంలోని అవిరేనికుంటతండాకు చెందిన బానోతు భద్యాకు స్థానికంగా సర్వే నంబర్ 540/246లో రెండెకరాల వ్యవసాయభూమి ఉంది. ఈ భూమిలో తనను సేద్యం చేసుకోనివ్వకుండా అదేతండాకు చెందిన బాలకృష్ణ, బాలులు అడ్డుకుంటున్నారని 2019లో హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 38/2019 గల ఇంజక్షన్ దావాను వారిపై దాఖలు చేశాడు. దీంతో 2020 ఫిబ్రవరి 5న భద్యాకు అనుకూలంగా కోర్టు ఇంజక్షన్ డిక్రీ ఇస్తూ తీర్పునిచ్చింది. అయినప్పటి కీ బాలకృష్ణ, బాలులు మరలా ఆటంకం కలిగిస్తుండడంతో 2021లో తిరిగి హుజూర్‌నగర్ కోర్టును ఆశ్రయించాడు. దీంతో కోర్టు భద్యాకు పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలో బాధితుడు భద్యా అప్పటి ఎస్‌ఐ రవిని కలిసి కోర్టు జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా రక్షణ కల్పించాలని కోరాడు. ఎస్‌ఐ రవి కోర్టు జారీచేసిన ఆదేశాలను ధిక్కరిస్తూ ప్రతివాదులైన బాలకృష్ణ, బాలులకు అనుకూలంగా వ్యవహరించి భద్యాను తన అనుమతి లేకుండా పొలంలోకి వెళ్లవద్దని, బాలకృష్ణ, బాలులకు రూ.3వేల చొప్పున చెల్లించాలని సూచించాడు. దీంతో భద్యా హైకోర్టును ఆశ్రయించాడు. వాదోపవాదాలు విన్న హైకోర్టు జడ్జి జస్టిస్ రాధారాణి ఎస్‌ఐ రవి ఉద్దేశ్యపూర్వకంగా కోర్టు ధిక్కారానికి పాల్పడ్డాడని తేల్చి, అతనికి 7రోజుల జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అదేవిధంగా సివిల్ జైలుశిక్షను అమలుపర్చడానికి 4వారాల పాటు మినహాయింపు ఇస్తున్నట్లు తీర్పులో పేర్కొన్నారని న్యాయవాది బాలకృష్ణ తెలిపారు. కాగా.. ఈవిషయమై ఎస్‌ఐ రవి మాట్లాడుతూ జైలుశిక్ష అమలుపర్చేందుకు 4వారాల పాటు మినహాయింపునిస్తూ తీర్పునిచ్చారని, దీంతో హైకోర్టు డివిజన్ బెంచ్‌కు తాను అప్పీలు చేసుకున్నానని తెలిపారు. సింగిల్ జడ్జి విధించిన జైలుశిక్ష, జరిమానాను రద్దుచేస్తూ తనకు అనుకూలంగా హైకోర్టు తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు. జడ్జిమెంట్ కాపీని ఈనెల 14 సోమవారం అందజేస్తానని ఎస్‌ఐ తెలిపారు.

విధులు అడ్డుకున్న ముగ్గురికి జైలు శిక్ష

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకపరిచిన ముగ్గురికి నెల రోజుల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ శుక్రవారం ప్రిన్సిపల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వర్ణలత తీర్పునిచ్చారు. మిర్యాలగూడలోని సాగర్ రోడ్డు నుంచి మున్సిపల్ కార్యాలయానికి దారి దారిలోని ఎన్‌ఎస్‌పీ స్థలంలో అక్రమంగా నిర్మించిన డబ్బాలను తొలగించాలని ఎన్‌ఎస్‌పీ అధికారులు కోరినా స్థానికులు అడ్డు తగిలారు. దీంతో ఎన్‌ఎస్‌పి అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఎం.శ్రీనివాసులు 2017 ఫిబ్రవరి 25న టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంపునకు చెందిన చిన్నప్ప, అశోక్‌నగర్‌కు చెందిన పెద్దోజు నరేంద్రచారి, సంతోష్‌నగర్‌కు చెందిన వాంకుడోతు బాలులపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో అప్పటి సీఐ సాయి ఈశ్వర్ గౌడ్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో వీరికి నెల రోజుల పాటు జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే మరో 8 రోజులు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ కృష్ణప్రసన్న వాదించగా టూ టౌన్ కోర్టు కానిస్టేబుల్ నరేష్ ప్రాసిక్యూషన్‌కు సహకరించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

వలిగొండ : వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో ఇద్దరు మృతిచెందారు. వలిగొండ మండలం నాతాళ్లగూడెం గ్రామానికి చెందిన జిల్లా లింగస్వామి(39) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. లింగస్వామి రోజూ మాదిరిగా పొలానికి నీరు పెట్టేందుకు గురువారం సాయంత్రం వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. రాత్రి 11 గంటలవరకు ఇంటికి తిరిగి రాలేదు. కంగారు పడిన అతడి భార్య దగ్గరి బంధువులను భర్త గురించి ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. అనంతరం బంధువులు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి చూడగా లింగస్వామి కాలువలో ఇరుక్కున్న చెత్త తొలగించడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందినట్లు గుర్తించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి..

కేతేపల్లి: చకేతేపల్లి మండలం కొప్పోలు గ్రామానికి రెడ్డి నంద్యాల జగన్‌రెడ్డి(32) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జగన్‌రెడ్డి శుక్రవారం తన స్నేహితులతో కలసి గ్రామ శివారులో ఉన్న మూసీనదిపై నిర్మించిన చెక్‌డ్యాంలో చేపల వేటకు వెళ్లాడు. కర్రకు విద్యుత్ వైరు కట్టి చెక్‌డ్యాంలోని నీటిలో చేపలు పడుతుండగా ప్రమాదశవాత్తు కర్రకు ఉన్న విద్యుత్ వైరు జగన్‌రెడ్డికి తగలటంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. జగన్‌రెడ్డికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

రెండు తలలతో మేకపిల్ల జననం

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండలం యర్రకుంటతండాలో శుక్రవారం రెండు తలలు, నాలుగు కాళ్లతో మేకపిల్ల జన్మించింది. యర్రకుంటాతండాకు చెందిన చింతలపాలెం ఎంపీటీసీ – 2 గుగులోతు బుజ్జిసక్రు నాయక్ పెంచుకుంటున్న మేక శుక్రవారం రెండు మేక పిల్లలకు జన్మనిచ్చింది. వాటిలో ఒకటి బాగానే ఉన్నా.. మరో మేకపిల్ల రెండు తలలు, నాలుగు కాళ్లతో జన్మించింది. ఈ మేక పిల్లను చూసేందుకు గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు భారీగా తరలివచ్చారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకుల దుర్మరణం

చౌటుప్పల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. చౌటుప్పల్, వేములపల్లి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. చిట్యాల మండలం చిన్నకాపర్తికి చెందిన కొండ ప్రసాద్(29) లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం చౌటుప్పల్‌లో డ్యూటీ ముగించుకుని బైకుపై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఆ క్రమంలో పంతంగి టోల్‌ప్లాజా వద్ద కల్వర్టు వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన అంబులెన్సు ఢీకొట్టింది. బైకు నడుపుతున్న ప్రసాద్ ఎగిరి చాలా దూరంలో రోడ్డు పక్కకు పడిపోయాడు. తలకు బలమైన గాయాలవ్వడంతో దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారకుడైన అంబులెన్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

వేములపల్లి : వేములపల్లి మండలం లక్ష్మీదేవిగూడెం గ్రామానికి చెందిన గమల్ల తిరుమలేష్(25) కొంతకాలంగా మిర్యాలగూడలో ఉంటున్నాడు. శుక్రవారం తిరుమలేష్ మిర్యాలగూడ నుంచి లక్ష్మీదేవిగూడెంలోని తన ఇంటికిబైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో సల్కునూరు క్రాస్‌రోడ్డు సమీపంలోని పాలేరు బ్రిడ్జి వద్దకు రాగానే బైక్ అదుపుతప్పడంతో కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో గాయపడిన తిరుమలేష్‌ను స్థానికులు మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కల్తీపాల తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండల పరిధి ఖైతాపురం గ్రామంలోని కల్తీ పాల కేంద్రంపై శుక్రవారం ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. కల్తీ పాలు, తయా రీ పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఖైతాపురా నికి చెందిన కందగట్ల మల్లారెడ్డి(47) పాల వ్యాపారం చేస్తున్నాడు. కొంత కాలంగా కల్తీ పాలు తయారు చేస్తున్నాడన్న సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. అప్పటికే తయారు చేసి సిద్ధంగా ఉంచిన కల్తీ పాలను, అందుకు వినియోగించే పాలపౌడర్ ప్యాకెట్లు, అరలీటర్ హైడ్రోజన్ పెరాక్సైడ్, రెండు క్యాన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ దేవేందర్ తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కల్తీ పాల క్యాన్లు

వేర్వేరు కారణాలతో ఆరుగురి బలవన్మరణం

బీబీనగర్: అప్పుల బాధతో ఇద్దరు.. కుటుంబ సమస్యలతో ఒకరు.. భర్త మద్యానికి బానిసయ్యాడని మరొకరు.. మానసిక ఒత్తిడితో ఇంకొకరు, రైలు కింద పడి వేరొకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఉమ్మడి జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి.

భర్త మద్యానికి బానసయ్యాడని..

కరీంనగర్ జిల్లా వీణవంక గ్రామానికి చెందిన నల్ల మానస (33)కు అదే ప్రాంతానికి చెందిన శ్రీనివాస్‌తో 2014లో వివాహమైంది. వీరికి కుమారుడు సంతానం. ఉపాధి కోసం శ్రీనివాస్ కుటుంబంతో కలిసి కొన్నేళ్ల క్రితం బీబీనగర్‌కు వలస వచ్చాడు. ఘట్కేసర్ మండలం బోగారం గ్రామంలోని లిక్కర్ గోదాంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శ్రీనివాస్ మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో భర్తను మద్యం మానేయాలని కోరినా శ్రీనివాస్ పట్టించుకోవడం లేదు. దీంతో మనస్తాపం చెందిన మానస గురువారం రాత్రి కుమారుడు నిద్రపోయాక, ఇంట్లో భర్త లేని సమయంలో ఉరేసుకుంది. శుక్రవారం ఉదయం ఇరుగు పొరుగు వారు గమనించి ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బోగారం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగేంధర్ తెలిపారు.

కొరటికల్‌లో..

మునుగోడు : మునుగోడు మండలం కొరటికల్ గ్రామానికి చెందిన అన్నం కృష్ణయ్య (31) తనకున్న కొద్దిపాటి భూమిలో వరి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సాగు పెట్టుబడులకు చేసిన అప్పులు అధికం కావడం, ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం తన వ్యవసాయ భూమిలో పురుగుల మందు తాగాడు. అనంతరం భార్యకు ఫోన్ చేసి మాట్లాడకపోవడంతో అనుమానంతో వ్యవసాయ భూమి వద్దకు వెళ్లగా అప్పటికే కృష్ణయ్య మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



మునుగోడు మండలం కొరటికల్ విచారణ చేస్తున్న పోలీసులు

కృష్ణానదిలో దూకి..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కోనసీమ జిల్లాకు చెందిన నార్ని నాగేశ్వరావు(27) అమలాపురంలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగించేవాడు. మూడు నెలల క్రితం నాగేశ్వర్‌రావు ఉద్యోగం మానేసి హైదరాబాద్ బాటపట్టాడు. అక్కడే గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. మూడు నెలలుగా ఉద్యోగం లేక, ఇతర మానసిక ఒత్తిడిలతో మనస్తాపం చెందిన నాగేశ్వర్‌రావు ఈ నెల 9న హైదరాబాద్ నుంచి సాగర్‌లోని కొత్త బ్రిడ్జి వద్దకు చేరుకుని నదిలోకి దూకాడు. శుక్రవారం ఉదయం మృతదేహం తిరుమలగిరి మండలంలోని జమ్మనకోట తండా వద్ద నీళ్లలో తేలియాడడంతో అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ సురేష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఉన్న ఐడీ కార్డుల ఆధారంగా నాగేశ్వరావుగా గుర్తించారు. అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత మృతదేహాన్ని అప్పగించారు. మృతుడి బావ సతీష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మానస (ఫైల్)



నాగేశ్వరావు(ఫైల్)

రైలు కిందపడి..

భువనగిరి : భువనగిరి పట్టణం బహార్‌పేటకు చెందిన సిద్దంకి భానుప్రసాద్(26) ఓ దొంగతనం కేసులో జైలు వెళ్లి ఈ నెల 9న ఇంటికి వచ్చాడు. అదే రోజు మద్యం కోసం కుటుంబ సభ్యులను డబ్బులు అడిగాడు. ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఈ నెల 11న ఉదయం పట్టణంలోని సుమంగళి ఫంక్షన్ హాల్ సమీపంలో సికింద్రాబాద్–కాజీపేట రైలు మార్గంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రైల్వే ఇంచార్జి హెడ్ కానిస్టేబుల్ ఎస్ సత్యనారాయణ తెలిపారు.

కుటుంబ సమస్యలతో..

అనంతగిరి: మండలంలోని గోండ్రియాలకు చెందిన ఏపూరి గాంధీ(25)కి ఏడాది క్రితం వివాహం జరిగింది. కుటుంబంలో సమస్యలు తలెత్తడంతో గ్రామ శివారులోని పాలేరు వాగు సమీ పంలోని ఓ చెట్టుకు శుక్రవారం ఉరివేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

యువరైతు ఆత్మహత్య..

సంస్థాన్ నారాయణపురం : చౌటుప్పల్ మండలం చింతలగూడెం గ్రామానికి చెందిన కొమరెల్లి రాజశేఖర్‌రెడ్డి(30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న రెండు ఎకరాలతో పాటు మరో 4ఎకరాలను కౌలుకు తీసుకుని వరి పత్తి సాగు చేస్తున్నాడు. సాగు అవసరాల నిమిత్తం రెండేళ్లుగా అప్పులు చేశాడు. ఆశించిన దిగుబడి రాకపోవడంతో అప్పుల భారం పెరిగిపోయింది. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలోనే రాజశేఖర్‌రెడ్డి ఈ నెల 9న వ్యవసాయ భూమి వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం సంస్థాన్ నారాయణపురం మండలం గుడిమల్కాపురం వ్యవసాయ పొలాల వద్ద దుర్వాసన వస్తుండడంతో రైతులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఘటనా స్థలంలో పురుగుల మందు డబ్బా ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నాడని భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చౌటుప్పల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేంద్ర తెలిపారు. కాగా, రాజశేఖర్‌రెడ్డికి వారం రోజుల క్రితమే కుమార్తె జన్మించింది.



రాజశేఖర్‌రెడ్డి(ఫైల్)